క్లుప్తంగా

గురుకుల విద్యార్థులకు మనోవిజ్ఞాన తరగతులు



మడికొండ: మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలో గురుకుల పాఠశాల, కళాశాల (బాలికలు) విద్యార్థినులకు మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ప్రహసిత్ సూచించారు. ప్రిన్సిపాల్ ఎస్.మల్లారెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రహసిత్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి వల్ల నిద్ర లేకపోవడం, ఎక్కువగా ఆలోచించడం, భయంతో తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతాయని తెలిపారు. ఒత్తిడిని ఎదుర్కోవడానికి శ్వాస సంబంధమైన వ్యాయామాలు, ఆరోగ్యకరమైన నిద్ర, మంచి ఆహార అలవాట్లను గురించి విద్యార్థులకు వివరించారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

వరంగల్: కాశిబుగ్గ జంక్షన్‌లో కొంతమంది ఆకతాయిలు ఆదివారం వీరంగం సృష్టించి కొట్టుకున్నారని ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్ తెలిపారు. వారంతా మైనర్లు కావడంతో వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాధ్యతగా పెంచాలని సూచించారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా, చెడ్డవారితో స్నేహం చేయకుండా చూడాలన్నారు. కొంతమంది పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.

గురుకులంలో కంటి వైద్య శిబిరం



ఖిలా వరంగల్ / న్యూశాయంపేట: వరంగల్ దూపకుంట రోడ్డులోని మైనార్టీ హైస్కూల్‌లో కంటి వైద్యులు వేణుగోపాల్, గణేష్, ఆర్‌బీఎస్‌కేటీం ఆధ్వర్యంలో సోమవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్ హాజరై నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి చూపు మందగిస్తే కళ్ల జోడు వాడాలని సూచించారు. విద్యార్థినులకు నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా కళ్ల జోళ్లు అందజేశారు.

23న వీర హనుమాన్ శోభాయాత్ర

నయీంనగర్: ఏప్రిల్ 23న విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ మహానగర అధ్యక్షుడు కేశిరెడ్డి జైపాల్‌రెడి, కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శోభాయాత్ర మధ్యాహ్నం వరంగల్ రంగశాయిపేట మహంకాళి దేవాలయం వద్ద ప్రారంభమై పద్మాక్షి దేవాలయం, హనుమత్‌గిరి వరకు సాగుతుందని వివరించారు. కార్యక్రమంలో వెలగందుల రాజు, నాగుల ప్రసాద్, గూడురు రాకేష్, పెండ్లి సునంద్, హరీష్, ఆదిత్యసాయి, వేణు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని విస్మరిస్తున్నారు

న్యూశాయంపేట: సమాచార హక్కు చట్టాన్ని విస్మరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. రాంనగర్ సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన చట్టాన్ని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. సమాచారం ఇవ్వకుండా నెలల తరబడి కాలయాపన చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, మంద సుచందర్, నాయకులు సురేష్, చిరంజీవి, సుమన్, హర్ష, మౌనిక, కర్ణాకర్, అనిల్, సతీష్, అశోక్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ క్రైం: ఆన్‌లైన్ అమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని జుబేర్ బుక్‌స్టాల్ పేరిట ఆన్‌లైన్‌లో పుస్తకాలు డెలివరీ చేస్తామని పోస్ట్ చేయడంతో నమ్మి చాలామంది ఆన్‌లైన్‌లో ఆ నంబర్‌కు డబ్బులు పంపించినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్

విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. హనుమకొండ లష్కర్ బజార్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని సూచించారు.

నగరంలో ముందస్తు ఉగాది వేడుకలు



విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో కవి సమ్మేళనం



ఉద్యోగిని సన్మానిస్తున్న బాబురావు



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న అర్చకులు

వరంగల్ చౌరస్తా: నగర వ్యాప్తంగా ఉగాది పర్వదిన వేడుకలను సోమవారం జరుపుకున్నారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాలలో ఉగాది కవి సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సోనబోయిన సతీష్ అధ్యక్షత వహించగా పాలకవర్గ అధ్యక్షుడు ఆకారపు హరీష్, సెక్రటరీ చిలుకమారి సంజీవ, బండారు ఉమామహేశ్వరరావు, సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ అధ్యాపకుడు డాక్టర్ నాగయ్య, కవులు ఆచార్య రామచంద్రమౌళి, కంది శంకరయ్య, లింగంపల్లి రామచంద్ర, కాగితం సారంగపాణి, తాండ్ర చిరంజీవి, పాతూరి రఘురామయ్య, ఆడెపు చంద్రమౌళి, వేణుగోపాలచార్య, వలస పైడి, పొదిల కార్తీక్, అధ్యాపకులు రంగాచార్యులు, మేకల లింగమూర్తి, జయకృష్ణ, శ్రీధర్ల కుమారస్వామి, శెట్టి దేవరాజు, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

జానపద గిరిజన విజ్ఞానపీఠంలో..

హన్మకొండ కల్చరల్: హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో సోమవారం ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం సిబ్బందిని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం ప్రొఫెసర్ భూక్య బాబురావు సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చూరెపల్లి రవికుమార్, డాక్టర్ బాసాని సురేష్, అబ్బు గోపాల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, జూనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, సునంద, సిబ్బంది ఆంజనేయులు, అశోక్, సులోచన, కస్తూరిబాయి, మోహన్, సుధాకర్ పాల్గొన్నారు.

మడికొండలో పంచాంగం ఆవిష్కరణ

మడికొండ: క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని మడికొండలో సోమవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ పంచాంగ సిద్ధాంతి అవసరాల ప్రసాదశర్మ, మడికొండ గ్రామ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మంత్రవాది వెంకటప్రసాద్, ఉపాధ్యక్షుడు అనుముల నవీన్‌శాస్త్రి, బాపిరాజు, రుగ్వేద శర్మ, దామోదర్, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

నేడు మెట్టుగుట్టపై పంచాంగ శ్రవణం

మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి దేవాలయంలో క్రోధినామ సంవత్సర పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రాతఃకాల రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులతో అభిషేకం, అర్చనలు జరిపించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్వామి వారికి ఉగాది పచ్చడి సమర్పించి భక్తులకు వితరణ చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6గంటలకు ఆలయ ప్రాంగణంలో అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ పంచాంగ శ్రవణం చేయనున్నట్లు పేర్కొన్నారు.

పెంచిన ఫీజులను ఉపసంహరించుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: గత ప్రభుత్వ హయాంలో గతేడాది కేయూలో పెంచిన అన్ని రకాల కోర్సుల ఫీజులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రిని కేయూలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, యూనివర్సిటీ నాయకుడు గణేష్ మాట్లాడుతూ గత సంవత్సరం పలు కోర్సుల్లో పెంచిన ఫీజులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కోర్సు పూర్తైన తర్వాత ఫీజు చెల్లించే స్తోమత లేని వారు తమ టీసీతో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లను యూనివర్సిటీలోనే వదిలేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన పరిశోధనల కోసం పరిశోధక విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫెలోషిప్‌ను ఏర్పాటు చేసి నెలకు రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నరేష్, ప్రవీణ్, అరిస్టాటిల్, వివేక్ పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని..

తెలంగాణలోని 14 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని, అందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, బాధ్యులు కోరారు. ఈమేరకు టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరగోపాల్‌ను కేయూలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కుక్టా బాధ్యులు మధుకర్‌రావు, వేణు, సదాశివ, రవీందర్ పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా..



కాజీపేట రూరల్: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

రామన్నపేట: ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 11వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు మెడకట్ల సుకుమార్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, బిన్ని లక్ష్మణ్, కార్పొరేటర్లు చీకటి శారద, విజయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్ కాలనీలో కాంగ్రెస్ నాయకుడు సిరిల్ లారెన్స్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో అజీజ్ ఖాన్, 63, 62వ డివిజన్ల కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్‌యాదవ్, నాయకులు గోల్కొండ రాంబాబు, రావుల సదానందం, గుంటి కుమారస్వామి, అశోక్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక రంజాన్ పర్వదినం



ఇఫ్తార్ పార్టీలో మాట్లాడుతున్న తన్వీర్



హన్మకొండ చౌరస్తా: భోజనం వడ్డిస్తున్న కుశాల్

ఖిలా వరంగల్: రంజాన్.. త్యాగానికి ప్రతీక అని అడ్వకేట్ అబ్దుల్ కరీమ్ ఎడికేషనల్, వెల్ఫేర్ టస్ట్ వరంగల్ చైర్మన్ ముసైహిద్ తహశీర్, వరంగల్ దూపకుంట రోడ్డులోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్ల నీలిమాదేవి అన్నారు. నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షతో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేయడం రంజాన్ మాసం గొప్పతనమని కొనియాడారు. గురుకులంలో టస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ నీలిమాదేవిని ట్రస్ట్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎంఏకే తన్వీర్, షాహీనబేగం, ఎండీ.షఫీయొద్దీన్, ఎండీ.గౌస్, అఫీజ్, ముఖీద్‌ఖాన్ పాల్గొన్నారు.

రాయపురలో ఇఫ్తార్ విందు

హన్మకొండ చౌరస్తా: కుశాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ రాయపురలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుశాల్ ముస్లింలకు పండ్లు పంపిణీ చేసి అనంతరం భోజనం వడ్డించారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరిన నాయకులకు కండువా కప్పుతున్న రమేష్, ధర్మారావు

హన్మకొండ: వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు సమక్షంలో పర్వతగిరి మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఉప సర్పంచ్‌లు కొరటాల సుబ్బారావు, గుమ్మడి ప్రసాదరావు, గుమ్మడి విజయ్ భాస్కర్‌తో పాటు గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ భట్టుపల్లికి చెందిన నాయకులు శేషాద్రి పోషన్న, రాజుతో పాటు పలువురు నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి అరూరి రమేష్, మార్తినేని ధర్మారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ వనం రెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ ఏకాంతం గౌడ్, నాయకులు రంగు కుమార్, రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

‘బీమా’ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

వరంగల్: మత్స్యశాఖ పరిధిలో కార్మికులకు సంబంధించిన ప్రమాద బీమా చెల్లింపుల్లోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ కోరారు. ఈమేరకు వరంగల్ జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో అధికారి నరేష్ కుమార్‌నాయుడును సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ప్రమాద బీమా విషయంలో ముదిరాజ్ మత్స్యకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సహజంగా మరణించిన ముదిరాజ్ మత్స్యకారుల కుటుంబాలకు కూడా ప్రమాద బీమా వర్తింపచేయాలని సూచించారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్, పొడాల రాణాప్రతాప్, సదానందం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మంగల్‌పాండే బలిదాన దినోత్సవం



మంగల్‌పాండే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వికాస్ పరిషత్ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: స్వాతంత్ర్య సమరయోధుడు మంగల్ పాండే బలిదాన దినోత్సవాన్ని భారత్ వికాస్ పరిషత్ ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని టౌన్‌హాల్ వద్ద మంగల్‌పాండే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వికాస్ పరిషత్ ఓరుగల్లు శాఖ అధ్యక్షుడు సుధీర్‌కుమార్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులపై యుద్ధాన్ని ప్రకటించిన మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు మంగల్ పాండే అని కొనియాడారు. 1857, ఏప్రిల్ 8న ఉరితీయబడిన హీరో మంగల్ పాండే అని గుర్తుచేశారు. కార్యక్రమంలో వికాస్ పరిషత్ కార్యదర్శి సత్యనారాయణ, బాధ్యులు వెంకట్‌రెడ్డి, చంచల్ అగర్వాల్, వీసీ రామారావు, బీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే బీఎల్ఎఫ్ ఎజెండా



మాస్ సావిత్రి

వరంగల్ చౌరస్తా: ఎన్నికల్లో ప్రజల సంక్షేమమే బీఎల్ఎఫ్ ఎజెండా అని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ రావు అన్నారు. బీఎల్ఎఫ్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా మాస్ సావిత్రిని వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో సూర్యప్రకాశ్ రావు, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ప్రకటించారు.

సంక్షిప్తంగా

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

విద్యారణ్యపురి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమలోని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో సోమవారం రాత్రి నిర్వహించిన కళాశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాలతో పోటీ పడేవిధంగా తమ విద్యావ్యవస్థలో అనేక మార్పులు రాబోతున్నాయని చెప్పారు. పింగిళి కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం అధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రజిత రాసిన మార్కెంటింగ్ మేనేజ్‌మెంట్ అనే పుస్తకాన్ని లింబాద్రి ఆవిష్కరించారు.

వంగపల్లి శ్రీనివాస్‌కు టికెట్ ఇవ్వాలి

హన్మకొండ: తెలంగాణ ఉద్యమకారుడు, ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌కు బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ టికెట్‌ను కేటాయించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ యువత రాష్ట్ర అధ్యక్షుడు, కోర్ కమిటీ సభ్యుడు పొట్టపింజర రమేష్ మాదిగ కోరారు. హనుమకొండ సుబేదారిలోని కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నమ్మకంగా ఉంటూ మాదిగలను ప్రాతినిథ్యం వహిస్తున్న శ్రీనివాస్‌ను వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించి సముచిత స్థానం కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ కోర్ కమిటీ సభ్యుడు చిలకమారి గణేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ఈదునూరి యాకయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా, నాయకులు మేడ స్వామి, చిన్నస్వామి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

హన్మకొండ చౌరస్తా: సినీహీరో అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను హనుమకొండ పెద్దమ్మగడ్డ శివారులోని స్వయంకృషి వృద్ధాశ్రమంలో సోమవారం నిర్వహించారు. ఆల్ ఇండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్, హనుమకొండ సిటీ ప్రెసిడెంట్ జనగాని శంకర్ ఆధ్వర్యంలో అనాథలు, వృద్ధుల సమక్షంలో కేక్‌కట్ చేసి పండ్లు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో అల్లు అర్జున్ ఫ్యాన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అచ్చుకట్ల రమేష్, రతన్‌గౌడ్, శివ, ఫిరోజ్, అశోక్, మోహన్‌కృష్ణ, జైకృష్ణ, సాయిభరత్, వినయ్, బిట్టు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా చండీహోమం

కాశిబుగ్గ: సోమవారం అమావాస్యను పురస్కరించుకుని 20 డివిజన్‌లో శ్రీరంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహా చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని భూపాలపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, భక్తులు దర్శించుకుచారు. కార్యక్రమంలో రంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరు సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, ఆలయ అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు మాటం శ్రీనివాస్, కోల కవిత, మంచాల శ్రీను, సుజన, వంగరి సమ్మయ్య, రాగుల ప్రసాద్, విరాట్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

హన్మకొండ చౌరస్తా: పేదలకు మెరుగైన వైద్య సేవలందేలా ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రులు కృషి చేయాలని కూరపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కూరపాటి రమేష్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ కుడా ఆఫీస్ రోడ్డులోని కూరపాటి ఆస్పత్రిలో 'ఆధునిక వైద్యం – మెరుగైన చికిత్స' అనే అంశంపై అవగాహన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలల్లో నిరుపేదలకు లాపరోస్కోపీ, లేజర్ వైద్య చికిత్సలో రాయితీతో కూడిన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాధిక, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సంతాన లింగేశ్వరుడికి తలపాగతో అలంకరణ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్ర ఆవరణలోని సంతాన లింగేశ్వర స్వామిని భక్తులు సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. సోమావతి అమావాస్యను పురస్కరించుకుని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఐనవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో సంతాన లింగేశ్వరుడికి అర్చకులు అర్చనలు, అభిషేకాలు జరిపించారు. స్వామివారికి తలపాగా చుట్టి అలంకరించారు. ఆలయ కార్యకర్తలతో కలిసి భక్తులు భజనలతో పాటు దర్బార్‌సేవ సేవ నిర్వహించారు.

శివశక్తి వినాయక మందిరంలో పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు జంక్షన్‌లోని శివశక్తి వినాయక మందిరంలో శివ, విఘ్నేశ్వరుడికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస శర్మ, చెన్నూరు దేవేందర్ ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకాలు, విఘ్నేశ్వరుడికి విశేషమైన పూజలు జరిపించారు. అనంతరం అశోక్ సోని, రాజేష్ ఉపాధ్యాయ నేతృత్వంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ట్రాన్స్‌జెండర్లు గౌతమి, రంజిత ప్రారంభించారు.

అంతిమ దశకు చేరిన ఎస్సీ వర్గీకరణ పోరాటం

కేయూ క్యాంపస్: మంద కృష్ణమాదిగ చేస్తున్న ఎస్సీ వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరుకుందని ఎమ్మెస్పీ నేత సూరన్న అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని హ్యూమానిటీస్ భవనంలో ఎమ్మెస్పీ కేయూ ఇన్‌చార్జ్ వడ్డెపెల్లి మధు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో సూరన్న మాట్లాడారు. ఈనెల 10న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల బాధ్యులతో మంద కృష్ణమాదిగ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో చంద్రశేఖర్‌మాదిగ, మంద భాస్కర్‌మాదిగ, అరిస్టాటిల్ పాల్గొన్నారు.

ఆరేళ్లుగా ఉచిత ఆరోగ్యశ్రీ సేవలు

కాశిబుగ్గ: నగరంలోని సంరక్ష సూపర్ స్పెషలిటీలో ఆరోగ్యశ్రీ వైద్య సేవలను ప్రారంభించి 6ఏళ్లు పూర్తయిందని ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ దిడ్డి శ్రవణ్ కుమార్, డాక్టర్ అజిత్ మహమ్మద్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద 48వేల మందికి ఓపీ సేవలు, 13వేల మందికి పలు రకాల శస్త్ర చికిత్సలు, వైద్య సేవలను ఉచితంగా అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు పోలా నటరాజ్, బండెల మోహన్‌రావు, శ్రవణ్, దినేష్, సురేష్, శ్రీనివాస్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మండు వేసవిలో దాహార్తి తీర్చనున్న చలివేంద్రం

హన్మకొండ: మండు వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుతో దాహార్తి తీరుతుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హోప్‌ఫుల్ హార్ట్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాలు దప్పిక తీర్చుకోవడానికి దోహదపడుతాయని చెప్పారు. హోప్‌ఫుల్ హార్ట్ సొసైటీ వ్యవస్థాపకుడు కేవీ.జాన్సన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, హోప్‌ఫుల్ సొసైటీ ప్రతినిధులు ఫాతిమా రెడ్డి, నరేంద్రపాల్, రఘు, భాస్కర్, బండారి ప్రభాకర్, మధుసూదన్ రెడ్డి, అనిల్‌కుమార్, ఎండీ.అక్బర్, దేవేందర్ రెడ్డి, సమత, రఘునందన్, కిరణ్ కుమార్, ఎన్పీడీసీఎల్ సీజీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కట్టిన గోడను తొలగించాలి

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ చిన్న బ్రిడ్జి సమీపంలోని, మేదరివాడ వెనుక లేన్‌లో కొంతమంది రోడ్డుకు అడ్డంగా గోడ కట్టారు. ఆ గోడను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు సోమవారం నిరసన తెలిపారు. బాధితులు మైసయ్య, సాంబయ్య, బ్రహ్మం, రాజు, ప్రసాద్, మహేష్, నరేందర్, పృథ్వీ, దేవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

హన్మకొండ: హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేంటేశ్వర స్వామి దేవాలయంలో ఉగాది పండగతో పాటు శ్రీరామ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయల నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 9నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెద్దమ్మ తల్లి జాతరకు ఏర్పాట్లు పూర్తి

ఖిలా వరంగల్: ఉగాది పర్వదినం సందర్భంగా వరంగల్ 37వ డివిజన్ పరిధిలోని తూర్పుకోటలో పెద్దమ్మ తల్లి జాతర మంగళవారం జరగనున్నది. తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈమేరకు జాతర పనులను ముదిరాజ్ కమిటీ ప్రతినిధులతో కలిసి స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సోమవారం పరిశీలించారు.

పోలీసుల అదుపులో నిందితుడు

వరంగల్ క్రైం: పోలీస్ శాఖలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నానని, తనకు సొంత ఇల్లు ఉందని నమ్మించి ఓ మహిళను మోసం చేసిన సంఘటనలో సిరిసిల్ల రాజన్న జిల్లాకు చెందిన మామిడి వెంకటేశ్వర్లు అలియాస్ కిరణ్‌పై హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఈమేరకు నిందితుడిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో నలుగురికి జైలు

కాజీపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరు యువకులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.విద్యాసాగర్ రావు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు తెలిపారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ షేక్ రహమాన్, బొమ్మిడి రాజు పట్టుబడగా వారికి న్యాయమూర్తి జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. అలాగే, మరో ఇరువై మందికి రూ.26,300ల జరిమానా విధించినట్లు వివరించారు.

రామన్నపేట: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు కోర్టు జైలుశిక్ష విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. సంగెం ఎల్గూరు రంగంపేటకు చెందిన గుగులోతు సోమయ్య, కాశిబుగ్గకు చెందిన ఎల్లస్వామి పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారని పేర్కొన్నారు.

మద్యం స్వాధీనం

వరంగల్: అనుమతి లేకుండా విక్రయిస్తున్న రూ.2380 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏనుమాముల ఎస్సై రాజు తెలిపారు. పక్కా సమాచారం మేరకు పైడిపల్లిలోని బెల్ట్‌షాపుపై సోమవారం దాడి చేసి జన్ను రమేష్ అనే విక్రయదారుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

లారీ ఓనర్‌పై దాడి

ఖిలా వరంగల్: లారీ లోడు విషయంలో ఓ లారీ ఓనర్‌పై మరో వర్గానికి చెందిన లారీ ఓనర్లు దాడి చేసి గాయపర్చారు. ఈమేరకు క్షతగాత్రుడిని తోటి లారీ ఓనర్లు ఎంజీఎం ఆస్పత్రికి తరలించిన ఘటన గొర్రెకుంట ఓరుగల్లు లారీ అసోసియేషన్ కార్యాలయంలోని లారీ పార్కింగ్ స్థలంలో జరిగింది. దాడి చేసిన వ్యక్తులపై గీసుగొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రాకేష్‌సింగ్ తెలిపాడు.